ఎగ్జిట్ పోల్స్ నేడే



సాయంత్రం 6.30 తర్వాత విడుదల

- ఈవీఎంలలో ఓటరు తీర్పు నిక్షిప్తం
- 19 రోజులుగా అభ్యర్థుల్లో టెన్షన్
- సమయం దొరకడంతో సర్వేలపై నమ్మకం
- విహారయాత్రల నుంచి తిరిగొస్తున్న నేతలు

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థులకు, ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల ప్రచారం సుదీర్ఘ కాలం సాగడం ఒకెత్తయితే.. ఫలితాల కోసం 19 రోజులుగా నీరిక్షిస్తుండడం మరో ఎత్తవుతున్నది. ఈవీఎంలలో తీర్పు నిక్షిప్తం కాగా, ప్రజలు ఎటువైపు మొగ్గారోనని అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొన్నది. ఈ టెన్షన్ నుంచి కొందరికి శనివారం కాస్త ఉపశమనం దొరికే అవకాశముంది. నేడు సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్‌పోల్స్ విడుదల కానున్నాయి. చివరి విడత పోలింగ్ ముగిసే దాకా ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించవద్దని కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధన విధించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రంలో మే 13నే పోలింగ్ ముగిసినా, సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను ప్రకటించడం లేదు. అటు రాజకీయపార్టీలు, ఇటు సర్వే సంస్థలు జూన్ 1వ తేదీ కోసం ఎదురుచూస్తున్నాయి. రాష్ట్రంలోని 17 లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల ఫలితాల అంచనాలు శనివారం విడుదల కానున్నాయి. ముఖ్యంగా ఏపీలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల ఎగ్జిట్ పోల్స్‌పైనే అందరి కండ్లూ నిలిచి ఉన్నాయి.

ఈ సారి మరింత పక్కాగా?

సాధారణంగా పోలింగ్ జరిగిన రోజు సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ విడుదల చేస్తుంటారు. దీంతో సర్వే సంస్థల అభిప్రాయ సేకరణ విస్తృతంగా జరగదనే అభిప్రాయం ఉన్నది. పోలింగ్‌కు ముందు, తర్వాత సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి అంచనాలు వేస్తుంటారు. ఈ సారి అందుకు భిన్నంగా సర్వే సంస్థలకు రెండువారాలకు పైగా సమయం దొరికింది. పోలింగ్ తర్వాత విస్తృతంగా సర్వే చేసి జనాభిప్రాయాన్ని తెలుసుకునే అవకాశం దక్కింది. ఇందుకు తగ్గట్టే అనేక సంస్థలు సుదీర్ఘంగా సర్వే కొనసాగించాయి. కాబట్టి ఈసారి ఫలితాలు మరింత కచ్చితత్వంతో ఉంటాయన్న నమ్మకం కుదిరింది.

విహారయాత్రలకు సెలవు

పార్టీల అభ్యర్థులు, నేతలు, కార్యకర్తలు దాదాపు రెండు నెలలపాటు మండుటెండల్లో చెమటోడుస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. పోలింగ్ తర్వాత ఫలితాల విడుదలకు సమయం ఉండటంతో అభ్యర్థులు, నేతలు విహారయాత్రలకు వెళ్లారు. కొందరు ఇంటికే పరిమితం కాగా, కొందరు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఫామ్‌హౌసుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ రానుండంతో ఒక్కొక్కరు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. విహారయాత్రలు ముగించుకొని తిరుగుపయనమయ్యారు. ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏకంగా రెండు వారాలపాటు లండన్ పర్యటనకు వెళ్లారు. శనివారం ఉదయం ఏపీకి రానున్నారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సైతం పది రోజుల విదేశీయాత్ర ముగించుకొని ఇటీవలే తిరిగొచ్చారు. తెలంగాణ రాష్ట్ర నేతలదీ ఇదే పరిస్థితి. మొత్తంగా పోలింగ్ తర్వాత చల్లబడ్డ రాజకీయ వాతావరణం ఎగ్జిట్ పోల్స్‌తో మళ్లీ వేడెక్కనున్నది.

పాస్‌పోర్ట్ సేవల్లో ఇబ్బందుల్లేవ్!

- సమస్యలొస్తే గంటలోపే పరిష్కారం
- నిరంతరాయంగా సేవలందిస్తున్నాం
- హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 31 (నమస్తే తెలంగాణ): పాస్‌పోర్ట్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ శుక్రవారం తెలిపారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే గంటలోపే పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలను గందరగోళపరిచే వార్తలు కొన్ని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో ఆమె స్పందించారు. ఎప్పటిలాగానే అవసరమైన స్లాట్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కస్లమర్ల నుంచి వచ్చే ఫిర్యాదులనూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులు స్లాట్స్ బుక్ చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభతరం చేశామని పేర్కొన్నారు. www.passportindia. gov.inలో పాస్‌పోర్ట్ సేవలు పొందవచ్చని తెలిపారు. కొంతమంది స్లాట్స్ బుక్ చేసుకోకుండానే కార్యాలయాలకు వెళ్తున్నారని, మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని ఆమె సూచించారు. ఏజెన్సీల మోసాలపై 1800113090 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి, +91-7428321144 కు వాట్సాప్‌లో మెసేజ్ ద్వారా ఫిర్యాదులు చేయొచ్చని పేర్కొన్నారు.

టీజీఎస్ఆర్టీసీలో అధికారుల పదవీ విరమణ

హైదరాబాద్, మే31(నమస్తేతెలంగాణ): టీజీఎస్ ఆర్టీసీలో శుక్రవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్-ఆపరేషన్స్ రఘునాథ రావు, చీఫ్ ట్రాఫిక్‌మేనేజర్(ఆపరేషన్స్) జీవన్‌ప్రసాద్‌తో పాటు మరో ఏడుగురు రిటైర్డ్ కాగా బస్‌భవన్‌లో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని సంస్థ నిర్వహించింది. ముఖ్యఅతిథిగా టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హాజరై ఉద్యోగ విరమణ పొందిన వారందరినీ సన్మానించారు. విరమణ పొందినవారిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమర్షియల్ నగేశ్, బీఆర్సీ మూర్తి (అకౌంట్స్ ఆఫీసర్), రవీందర్ రావు (ఏఎంఎఫ్), హరికిషన్(సూపరింటెండెంట్), హఫీజ్ (సీనియర్ అసిస్టెంట్), కృష్ణ(రోటిన్ క్లర్క్),బాలిరెడ్డి (రికార్డు ట్రేసర్) ఉన్నారు. కార్యక్రమంలో సీవోవో డాక్టర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పురుషోత్తం, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయపుష్ప, హెచ్‌వోడీలు, ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ కుంభకోణంలో మరో ఇద్దరి అరెస్ట్

ఏసీబీ అదుపులో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మాజీ ఓఎస్డీ

హైదరాబాద్, మే 31/ నాంపల్లి కోర్టులు (నమస్తే తెలంగాణ) : గొర్రెల పంపిణీ కుంభకోణంలో ఏసీబీ అధికారులు శుక్రవారం అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్‌కుమార్, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సబావత్ రాంచందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ గొర్రెల పంపిణీ నిబంధనలు ఉల్లఘించి వీరిని జ్యుడీషియల్ రిమాండ్ కోసం హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చింది. వీరిని చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసులో 8 మంది నిందితులు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కుంభకోణంలో రూ.700 కోట్ల అవినీతి జరిగినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

ఎక్స్‌టెన్షన్లు రద్దు చేయాలని మంత్రి ఉత్తమ్‌కు ఇంజినీర్ల వినతి

హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ విరమణ పొందిన ఇంజినీర్ల ఎక్స్‌టెన్షన్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయా అసోసియేషన్ బాధ్యులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

మణికొండలో పట్టుబడిన బన్సీలాల్, కార్తీక్, నికేశ్‌కుమార్

వనపర్తిలో పట్టుబడిన ఎస్ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేందర్, ఏఈ మధుకర్

పట్టుబడిన కుషాయిగూడ ఎస్సై షేక్ షఫీ, సీఐ వీరస్వామి, మధ్యవర్తి ఉపేందర్

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- లక్షల రూపాయల లంచం డిమాండ్
- పట్టుబడ్డ ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్తు, పోలీసు అధికారులు
- తొమ్మిది మంది ప్రభుత్వ ఉద్యోగులు, మధ్యవర్తి అరెస్టు

చర్లపలి/మణికొండ, రంగారెడ్డి మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏసీబీ దాడులు తీవ్రతరం చేసింది. నీటిపారుదల, రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు శాఖల్లోని అవినీతి చేపల వ్యవహారంపై వేట మొదలుపెట్టింది. దాడుల్లో తొమ్మిది మంది ప్రభుత్వ ఉద్యోగులను, మరొకరిని అరెస్టు చేసింది. రంగారెడ్డి జిల్లా రెడ్‌హిల్స్ నీటిపారుదల శాఖ కార్యాలయంలో గురువారం రాత్రి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అక్కడ నలుగురు ప్రభుత్వ ఉద్యోగులుండగా, ముగ్గురు పట్టుబడ్డారు. సర్వేయర్ పరారుకావడంతో అతన్ని కూడా పట్టుకొన్నారు. వివరాల్లోకెళ్తే.. రంగారెడ్డి జిల్లా మణికొండలోని నెక్నాస్‌పూర్‌లో భవన నిర్మాణానికి, ఇరిగేషన్ అనుమతుల కోసం బాధితుడు బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి దరఖాస్తు చేసుకొన్నాడు. అతడికి ఎన్‌వోసీ ఇవ్వడానికి ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భన్సీలాల్, అసిస్టెంట్ ఇంజినీర్ కే కార్తీక్, మరో సెక్షన్ ఏఈ నికేశ్‌కుమార్ రూ. 2.5 లక్షలు డిమాండ్ చేశారు. రూ.1.5 లక్షలు ముందుగానే తీసుకొన్నారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఇరిగేషన్ కార్యాలయంలో ఈ ముగ్గురికి బాధితుడు మరో రూ.లక్ష ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. అక్కడే ఉన్న గండిపేట సర్వేయర్ పీ గణేశ్ కూడా సర్వే చేసేందుకు బాధితుడి వద్ద రూ.40 వేల లంచం తీసుకొంటుండగా పట్టుబడ్డారు. నలుగురిని అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

వనపర్తిలో పట్టుబడ్డ ముగ్గురు అధికారులు

కొత్తకోట మండలం నిర్విన్‌కు చెందిన కాంట్రాక్టర్ ఎన్ ప్రవీణ్, లక్ష్మీనారాయణకు చెందిన రెస్టారెంట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాడు. ఇందుకు సంబంధించి రూ.2,11,421 బిల్ చేయడానికి విద్యుత్ శాఖ ఎస్ఈ పీవీ నాగేంద్రకుమార్, డీఈ నరేందర్, ఏఈ మధుకర్‌ను కాంట్రాక్టర్ సంప్రదించాడు. బిల్లు చేసేందుకు రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా.. రూ.19 వేలకు ఒప్పుకొన్నాడు. బాధితుడు ప్రవీణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం రాత్రి ప్రవీణ్ వనపర్తి ఎస్ఈ కార్యాలయంలో ఈ ముగ్గురికి మొత్తం డబ్బును చెల్లిస్తుండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. తర్వాత నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్, ఎస్సై అరెస్ట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడకు చెందిన సింగిరెడ్డి భరత్‌రెడ్డిపై భూతగాదా విషయంలో కేసు నమోదైంది. ఈ కేసులో పూర్తిగా సహకరించేందుకు రూ. 3 లక్షలు లంచం ఇవ్వాలంటూ బాధితుడిని కుషాయిగూడ ఎస్సై షేక్ షఫీ, ఇన్‌స్పెక్టర్ వీరస్వామి డిమాండ్ చేశారు. లంచం డిమాండ్ చేస్తున్నారంటూ బాధితుడు భరత్‌రెడ్డి ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం బాధితుడు రూ. 3 లక్షల లంచాన్ని మధ్యవర్తి ఉపేందర్ ద్వారా ఎస్సై షేక్‌షఫీకి ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు. దీంతో ఎస్సై, మధ్యవర్తి ఉపేందర్‌ను అరెస్టు చేశారు. విచారణలో ఇన్‌స్పెక్టర్ వీరాస్వామికి కూడా వాటా ఉందని తేలడంతో అతనిని కూడా అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

'ఐదేండ్ల సర్వీస్ పూర్తయిన వారి వివరాలివ్వండి'

హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ బదిలీల కోసం ఒకే ఇరిగేషన్ స్టేషన్‌లో ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారుల జాబితాను జూన్ 4లోగా పంపించాలని అన్ని యూనిట్లకు ఇరిగేషన్ ఈఎన్సీ (అడ్మినిస్ట్రేషన్) శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. 2024 మే 31 నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఏఈ, డీఈఈ, ఈఈ, ఎస్ఈ వరకు అధికారుల జాబితాను పంపాలని సూచించారు.

ఈఈలకు ఎస్ఈలుగా అదనపు బాధ్యతలు

హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఈల స్థానంలో నలుగురు ఈఈలు, ఒక ఎస్ఈకి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నర్సంపేట ఎస్ఈగా ములుగు ఇరిగేషన్ సర్కిల్ డివిజన్-2 ఈఈ వీ జగదీశ్‌కు, పోచంపాడ్ ఎస్ఈగా జగిత్యాల డివిజన్ -5 ఈఈ టీ శ్రీనివాసరావు గుప్తాకు, సంగారెడ్డి ఎస్ఈగా మెదక్ ఎస్ఈ యేసయ్యకు, స్టేట్ డ్యామ్ సేఫ్టీ అర్గనైజేషన్ ఎస్ఈగా వాలంతరీ ఈఈ రవీందర్‌రెడ్డికి, భద్రాచలం డిప్యూటీ ఎస్ఈగా భద్రాచలం డివిజన్- 5 ఈఈ హెచ్‌వీ రామ్‌ప్రసాద్‌ను నియమించింది. సాగునీటిశాఖ పారుదలశాఖ ఓఅండ్ఎం ఈఎన్సీ నాగేందర్‌రావును 6 నెలల పాటు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించింది.

లోన్‌యాప్ వేధింపులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలి

దుండిగల్, మే 31: లోన్‌యాప్ వేధింపులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలయ్యాడు. పోలీసులు వివరాల ప్రకారం.. ఏపీలోని శ్రీకాకుళంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీరవర్ధన్(33), విమల దంపతులు బాచుపల్లి కౌసల్య కాలనీలో ఎస్ఎస్‌కే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. వీరవర్ధన్ ఇటీవల ఓ లోన్‌యాప్‌లో రుణం తీసుకోగా యాప్ నుంచి వేధింపులు అధికమయ్యాయి. బుధవారం వీరవర్ధన్ పెద్దమ్మకు లోన్‌యాప్ నిర్వాహకులు ఫోన్‌చేసి వీరవర్ధన్ డబ్బులు చెల్లించడంలేదని తెలిపారు. కాగా, గురువారం ఆయన ఫ్లాట్ హాల్లో హర్షవర్ధన్ ఉరేసుకుని కనిపించాడు. కొన్ని నెలలక్రితం వీరవర్ధన్ భార్య కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. వీరికి 6 నెలల కొడుకు ఉన్నాడు.

నాలుగో త్రైమాసికంలో వృద్ధి 7.8 శాతమే

క్యూ3తో పోలిస్తే తగ్గిన జీడీపీ

న్యూఢిల్లీ, మే 31: దేశ జీడీపీ గణాంకాలు ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో నిరాశపర్చాయి. అంతకుముందు త్రైమాసికం అక్టోబర్-డిసెంబర్‌లో 8.6 శాతంగా ఉంటే.. ఈసారి మాత్రం 7.8 శాతానికే పరిమితమయ్యాయి. జూలై-సెప్టెంబర్‌లో 8.1 శాతంగా, ఏప్రిల్-జూన్‌లో 8.2 శాతంగా ఉండటంతో.. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తం 4 త్రైమాసికాల్లో చివరి త్రైమాసికంలోనే 8 శాతం దిగువన వృద్ధి నమోదైనట్టైంది. ఈ మేరకు జాతీయ గణాంకాల కార్యాలయం శుక్రవారం తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం జీడీపీ 8.2 శాతంగా ఉన్నది. అంతకుముందు 2022-23లో ఇది 7 శాతం..

వ్యవసాయం దిగాలుగా..

దేశంలో ఎంతోమందికి జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం దిగాలు పడింది. జనవరి-మార్చిలో వ్యవసాయ రంగ వృద్ధి 0.6 శాతం పడిపోయింది. గతంలో ఇది 7.6 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమన్న విమర్శలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి. మోదీ సర్కారు వ్యవసాయ రంగానికి తగినంత ప్రాధాన్యతనివ్వడం లేదని వ్యవసాయ, దాని ఆధారిత పరిశ్రమ వర్గాలు ఒకింత అసహనం వెలిబుచ్చుతున్నాయి.

ద్రవ్యలోటు 5.6 శాతం

గత ఆర్థిక సంవత్సరం (2023-24) కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు.. దేశ జీడీపీలో 5.6 శాతంగా నమోదైంది. ఈ మేరకు శుక్రవారం కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీజీఏ) విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. ప్రభుత్వ ఆదాయం కన్నా, వ్యయం ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వ్యత్యాసాన్నే ద్రవ్యలోటుగా పరిగణిస్తామన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదాయ-వ్యయాల మధ్య తేడా రూ.16.53 లక్షల కోట్లుగా ఉన్నది. ఇది జీడీపీలో 5.63 శాతానికి సమానం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జీడీపీలో 8.2 శాతంగా ఉన్నది. కాగా, ఈసారి నికర పన్ను వసూళ్లు రూ.23.26 లక్షల కోట్లుగా ఉన్నాయి.

లక్ష కిలోల బంగారం

ఇంగ్లాండ్ నుంచి భారత్‌కు తరలించిన ఆర్బీఐ

ముంబై, మే 31: ఇంగ్లాండ్ నుంచి 100 మెట్రిక్ టన్నుల బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చింది రిజర్వుబ్యాంక్. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇంతటి విలువైన పుత్తడిని ఒకే ఏడాది తీసుకురావడం విశేషం. 1991 తర్వాత ఇంతటి స్థాయిలో బంగారాన్ని తరలించడం కూడా ఇదే తొలిసారి. ఆర్థిక సంక్షోభం కారణంగా గతంలో భారత్ పెద్ద ఎత్తున బంగారాన్ని విదేశాల్లో తనఖా పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుంటంతో విదేశాల్లో తనఖా పెట్టిన బంగారాన్ని తిరిగి తీసుకోస్తున్నది రిజర్వు బ్యాంక్. దీంట్లోభాగంగా 2023-24లో ఇంత పెద్ద మొత్తంలో పుత్తడిని తీసుకొచ్చింది. అలాగే అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరుగుతుండటంతో గతేడాది కొత్తగా 27.46 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో ప్రస్తుతం సెంట్రల్ బ్యాంక్ వద్ద 822 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉండగా, వీటిలో సగానికి పైగా 413.79 టన్నులు విదేశాల్లో నిల్వ ఉంచింది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో చాలా దేశాలకు చెందిన కేంద్ర బ్యాంకులు తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. ఇదే క్రమంలో భారత్ సైతం అక్కడ పెద్ద మొత్తంలో పసిడిని నిల్వవుంచింది. 2009లో అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి కొనుగోలు చేసిన 200 టన్నుల బంగారాన్ని విదేశాల్లో ఉన్న సెంట్రల్ బ్యాంక్‌ల్లో దాచిపెట్టింది. మరోవైపు, బంగారం తీసుకు రావడం వల్ల భారత్‌కు ఒరిగేదేమి లేదని, దేశీయ ఆర్థిక వ్యవస్థలో ఎలాంటి మార్పులు జరిగే అవకాశాలు లేవని కాంగ్రెస్ ప్రతినిధి చిదంబరం విమర్శించారు.

మార్కెట్లపై ఫలితాల ప్రభావమెంత?

న్యూఢిల్లీ/ముంబై, మే 31: ఈసారి కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది?.. బీజేపీ మళ్లీ సొంతంగా మెజారిటీ సీట్లను గెల్చుకుంటుందా?.. లేదా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మద్దతుతో మూడోసారి గద్దెనెక్కుతుందా?.. లేక కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిదే అధికారమా?.. ఇవి.. ఇప్పుడు యావత్తు దేశం మదిలో మెదులుతున్న ప్రశ్నలు. నెలన్నర రోజులుగా సాగిన లోక్‌సభ ఎన్నికల తంతు.. శనివారంతో ముగిసింది. ఇప్పుడు అందరి చూపు మంగళవారం వెలువడే ఫలితాలపైనే. దేశీయ స్టాక్ మార్కెట్లదీ ఇంతే. అవును.. కేంద్రంలో కొలువుదీరే కొత్త ప్రభుత్వం ప్రభావం.. ఈక్విటీ మార్కెట్లపై కచ్చితంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. గతకొద్ది రోజులుగా తీవ్ర ఒడిదొడుకుల మధ్య పడుతూ, లేస్తూ సాగుతున్న సూచీలే ఇందుకు నిదర్శనం. అందుకే ఫలితాల అనంతర పరిణామాలపై మార్కెట్ నిపుణుల నుంచి రకరకాల విశ్లేషణలు వస్తున్నాయి. స్థూలంగా చెప్పాలంటే.. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి, ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మార్కెట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవుతాయన్న అంచనాలే అధికం. కాగా, బిజినెస్ టుడే సర్వే ప్రకారం.. బీజేపీ సొంతంగా 300-320 సీట్లు గెల్చుకోవచ్చని స్టాక్ మార్కెట్ల విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా 303 సీట్లు గెల్చుకోగా, మొత్తం ఎన్డీఏ కూటమికి 352 సీట్లు దక్కిన సంగతి విదితమే.

ఎన్నికల పరిణామాలపై నిపుణుల అంచనాలేమిటి

2019 మెజారిటీని మించి ఈసారి బీజేపీ విజయాన్ని దక్కించుకుంటే.. ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో పరుగులు పెడుతాయి. పాలసీపరమైన జోష్ ఇందుకు కారణం.

-రాజేశ్ భాటియా, ఐటీఐ మ్యూచువల్ ఫండ్ సీఐవో

రూపాయి విలువ, బాండ్ ఈల్డ్స్ కొంత రికవరీ అయ్యే వీలున్నది. బీజేపీ గెలుపు.. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువను షార్ట్ టర్మ్‌లో దాదాపు 82.80 స్థాయికి బలపర్చగలదు.

-వీఆర్‌సీ రెడ్డి, కరూర్ వైశ్యా బ్యాంక్ ట్రెజరీ అధిపతి

మ్యాజిక్ ఫిగర్‌ను అందుకుని 272 సీట్లనే బీజేపీ గెల్చుకుంటే.. మార్కెట్లు ఒడిదొడుకులకు లోను కావచ్చు. అయితే మళ్లీ తేరుకుని సూచీలు పరుగులు పెట్టడం ఖాయం.

-జేమ్స్ థామ్, ఏషియన్ ఈక్విటీస్ ఇన్వెస్ట్‌మెంట్ డైరెక్టర్

బీజేపీ లేదా ఎన్డీఏ కూటమి ఈసారి అధికారంలోకి రాకపోతే స్టాక్ మార్కెట్లు 20 శాతానికిపైగా పడిపోవచ్చు. తిరిగి పుంజుకోవడానికి చాలా సమయమే పడుతుంది. కనుక మదుపరులు తమ పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని కనబర్చాలి. రకరకాల సాధనాల్లోకి పెట్టుబడులను మళ్లిస్తే ఒడిదొడుకులను తట్టుకోవచ్చు.

-జితేంద్ర గోహిల్, కొటక్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజర్స్ సీఐఎస్

ఈసారి బీజేపీ ఓడిపోతే దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నాయి. కనీసం 25-30 శాతం పడిపోవచ్చు. అయితే ప్రస్తుత ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వచ్చినా లాభాల స్వీకరణల మధ్య మార్కెట్ కరెక్షన్‌కూ వీలుంటుందనిపిస్తున్నది. ఏదిఏమైనా 10 శాతం నష్టాలు తప్పవని చెప్పవచ్చు.

-దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్న ఓ మదుపరి

ఈసారి ఎన్నికల్లో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి 300ల కంటే తక్కువ సీట్లు వచ్చినా మార్కెట్లపై ఆ ప్రభావం పెద్దగా ఉండదు.

-ఉమేశ్‌కుమార్ మెహతా, సామ్కో అసెట్ మేనేజ్‌మెంట్

ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపోటములు రూపీ విలువను, బాండ్ ఈల్డ్స్‌ను చెప్పుకోదగ్గ స్థాయిలో ఏమీ ప్రభావితం చేయబోవు.

-విజయ్ శర్మ, పీఎన్‌బీ గిల్ట్స్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు

ఎస్టీపీపీలో కాలుష్యానికి చెక్

రూ.700 కోట్లతో ఎఫ్‌జీడీ ప్లాంట్ నిర్మాణం

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ.. కాలుష్య నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. విద్యుత్తు ఉత్పత్తి కోసం బొగ్గును మండించడం వల్ల వెలువడుతున్న సల్ఫర్ డయాక్సైడ్‌ను నియంత్రించేందుకు మంచిర్యాల మండలం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో రూ.700 కోట్లతో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) ప్లాంట్‌ను నిర్మిస్తున్నది. ఏడాదిన్నర నుంచి కొనసాగుతున్న ఈ పనులు ఇప్పటికే దాదాపు పూర్తి కావొచ్చాయి. డిసెంబర్‌లో ఎఫ్‌జీడీ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సింగరేణి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఎస్టీపీపీలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 2 యూనిట్లు ఉన్నాయి. వాటిలో విద్యుత్తు ఉత్పత్తి కోసం రోజూ దాదాపు 17 వేల టన్నుల బొగ్గును మండిస్తుండటంతో సల్ఫర్ డయాక్సైడ్, సల్ఫర్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్ లాంటి హానికర వాయువులు వెలువడుతున్నాయి. వీటి వల్ల ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉండటంతో ఎఫ్‌జీడీని ఏర్పాటు చేస్తున్నారు.

ఎఫ్‌జీడీలో ఏం చేస్తారంటే..

- సల్ఫర్ డయాక్సైడ్, సల్ఫర్ మోనాక్సైడ్ తదితర హానికర వాయువు